# బిజినెస్

"మల్లిక్"

గోపాల్రావు శారదలు ఒకటే ఆఫీసులో పనిచేస్తారు. వాళ్లు మొదట్లో కొద్ది కొద్దిగా మాట్లాడుకునేవారు.... అదీ ఆఫీసు పనికి సంబంధించినంత వరకే. కాని రానురాను వారిమధ్య చనువు పెరిగింది. అప్పటినుంచీ ఆఫీసు పనికి సంబంధించిన విషయాలు తప్ప మిగతావన్నీ మాట్లాడడం మొదలుపెట్టారు. శారద కాస్త అందంగానే ఉంటుంది. గోపాల్రావు శారదవైపు ఆకర్షింపబడ్డాడు. శారద కూడా గోపాల్రావుని ప్రేమించింది. శారద ప్రేమించింది గాబట్టి గోపాల్రావు చాల అందంగా ఉంటాడనుకుంటే మాత్రం పొరబాటు పడినట్టే. అతను అతిసాధారణంగా ఉంటాడు. కానీ ఎప్పుడూ చాల ట్రిమ్‌గా దొరబాబులా తయారయి ఆఫీసుకు వస్తాడు.

ఆఫీసులో ఊరికే మాట్లాడడంతో తృప్తిపడలేదు వాళ్లిద్దరూ. బయట సినిమాలకీ, షికార్లకీ తిరగడం మొదలుబెట్టారు. ప్రేమించుకున్నవాళ్లు ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా?....

చివరికి వాళ్లిద్దరూ పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తారీఖు కూడా నిర్ణయం అయిపోయింది. వచ్చే వారమే వాళ్ల పెళ్లి.... రిజిస్ట్రార్ ఆఫీసులో.

ఆ రోజు లంచ్ సమయంలో "శారదా.... ఈ వేళ మనం పార్కుకి వెళ్దాం...." అన్నాడు గోపాల్రావు.

"ఊహూ.... మనం ఏదైనా మంచి సినిమాకి వెళ్దాం...." అంది శారద తను తెచ్చుకున్న టిఫిన్‌లో సగం గోపాల్రావుకు పెడ్తూ.

"అదికాదు శారదా ... నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి అందుకనే పార్కుకే వెళ్దాం."

అతని ముఖం గంభీరంగా ఉంది. కొన్ని క్షణాలు అతని వంక విస్మయంగా చూసి "సరే" అంది శారద. శారదకూడా సాయంత్రం వరకూ ఏవేవో ఆలోచిస్తూనే గడిపింది.

సాయంత్రం ఇద్దరూ పార్కుకి వెళ్లారు. ఎక్కువగా జనంలేని ఒక మూల వెళ్లి కూర్చున్నారు.

"వచ్చే వారం మన పెళ్లి జరగబోతుంది కాబట్టి నీకు కొన్ని విషయాలు చెప్పదలుచుకున్నాను శారదా. ఇప్పుడు దాచినా పెళ్లయ్యాకయినా అవి బయట పడక తప్పదు. అందుకే చెప్పేస్తాను. అయినా కాబోయే భార్యాభర్తలం. మన మధ్య దాపరికాలు ఉండ కూడదు కదూ!" అన్నాడు గోపాల్రావు ఆకాశంలోని తెల్లని మబ్బుతునకల్ని చూస్తూ.

"అవును గోపాల్. నువ్వు చెప్పింది నిజమే."

"అయితే నేను చెప్పేది జాగ్రత్తగా విను. నేను చాల ఖరీదైన బట్టలు వేసుకుని ఆఫీసులో అందరికంటే నీటుగా తయారయి వస్తాను. నాకు మంచి మంచి బట్టలు రకరకాల ఫాషన్లలో తొడుక్కోడం అంటే సర్దా. నా జీతం అంతా ఇలా బట్టలకే తగలేస్తాను. అంతేకానీ నేను డబ్బున్న వాడిని కాను శారదా." ముఖం పక్కకి తిప్పేస్తూ అన్నాడు గోపాల్రావు.

"కానీ..." శారద ఏమో అనబోయింది.

"నన్ను మధ్యలో ఆపకు... పూర్తిగా చెప్పనియ్యి. నాకు ఇరవై ఎకరాల మాగాణి ఉందని, విజయవాడలో రెండు పెద్ద మేడలు ఉన్నాయనీ, బాంక్‌లో నా అక్కౌంటులో వేలకొలదీ డబ్బుందని నేను నీతో చెప్పిన మాట లన్నీ ఒట్టి కోతలు. కేవలం నిన్ను ఆకర్షించడానికే అలా చెప్పాను."

"కాని నేను.."

"ప్లీజ్. మధ్యలో అడ్డు తగలకు శారదా. నా మనసులో ఏమీ దాచుకోకుండా అంతా చెప్పేయనీయ్. నిన్ను నావైపు ఆకర్షించుకుని నిన్ను పెళ్లిచేసుకోవాలన్నదే నా కోరిక. ఇంట్లోవాళ్ళయితే ఏ యస్సెల్సీ తప్పిన అమ్మాయినో ఇచ్చి కట్టబెడతారు... ఏమైనా అంటే ఆడదానికి చదువులు ఎందుకూ అంటారు. ఈ నాటి పరిస్థితి గురించి వాళ్ళు ఆలోచించరు.

మొగుడూ పెళ్ళాలు ఇద్దరూ కలిసి పనిచేస్తేగానీ అయిదువేళ్లూ నోట్లోకి వెళ్లవు. నిన్ను చేసుకుంటే ఇద్దరి జీవితాలు సుఖంగా వెళ్ళదీయవచ్చు అంతేకాదు నువ్వుకూడా లక్షాధికారికి ఏకైక పుత్రికవి ఏనాటికైనా ఆస్తి నీది అవుతుంది. అప్పుడు మన జీవితం సుఖంగా సాగుతుంది మా నాన్న చేసిన అప్పులుకూడా తీరతాయి శారదా నేను చాలా స్వార్థపరుడ్ని కదూ? నీ పవిత్రమైన ప్రేమకు నేను తగనేమో అనిపిస్తుంది ఏంచేస్తాం శారదా స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ కానీ జీవితాంతం నిన్ను ప్రేమగా చూసుకుంటాను. నన్ను నమ్ము

ఇప్పుడు నీమీద నిజమైన ప్రేమ ఏర్పడబట్టే మనసులో ఏమీ దాచుకోలేక అంతా బయటికి వెళ్ళగక్కాను " అన్నాడు గోపాల్రావు తలను వంచుకొని

శారద ముఖం పాలిపోయింది.

"కానీ కానీ "

"ఇప్పుడు నన్ను పెళ్ళిచేసుకోవడం నీ కిష్టంలేదా?" దీనంగా శారద ముఖంవంక చూశాడు గోపాల్రావు

"కాదు గోపాల్ కాని నేను లక్షాధికారి ఏకైక పుత్రికను కాదు. మా నాన్నగారు బ్రతకలేని బడిపంతులు. మాది గంపెడు సంతానం. వచ్చే సంవత్సరం మా నాన్నగారు రిటైరౌతారు నేను డబ్బుండేవాడిని చేసుకుంటే నా జీతం గురించి భర్త అడగడు గనుక ఇంటికి ఎంతైనా సహాయం చేయవచ్చని అనుకున్నాను నువ్వు ఏ ఊహలతో నా దగ్గరికి చేరావో నేను అవే ఊహలతో నీ దగ్గరికి చేరాను ఏంచేస్తాం గోపాల్ స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ "

శారద కళ్ళలో నీరు ఉబికింది. ఇప్పుడు గోపాల్రావు ముఖం పాలిపోయింది.

కాసేపట ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. శారద గోపాల్రావు చేతులు అందుకొని వాటిలో తన ముఖం దాచుకొని కన్నీరు కార్చింది, అప్పటికి కాస్త తెప్పరిల్లిన గోపాల్రావు శారద వీపు ప్రేమగా నిమిరాడు.

"చీకటి పడుతుంది ఇక వెళ్దాం పద ..." అంటూ శారద చెయ్యి పట్టుకుని లేపాడు గోపాల్రావు,